క్లుప్తంగా

నేడు తైక్వాండో పోటీలు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): జిల్లా తైక్వాండో సంఘం ఆధ్వర్యంలో కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఆదివారం ఉదయం 39వ సీనియర్స్ తైక్వాండో పోటీలను కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించి శనివారం వివిధ జిల్లా నుంచి హాజరైన క్రీడాకారుల బరువు లెక్కింపును నిర్వహించారు. ఈ పోటీలకు రాష్ట్ర కార్యవర్గం నుంచి కార్యదర్శి చంద్రమౌళి, కోశాధికారి ఎస్‌కే అబ్దుల్ సలాం హాజరయ్యారు. బెంగళూరు నుంచి ఆరు జాతీయ స్థాయి రిఫరీల పర్యవేక్షణలో పోటీలు జరగనున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి విచ్చేసిన క్రీడాకారులకు స్థానిక కాస్మోక్లబ్‌లో వసతి ఏర్పాట్లు చేశారు. జిల్లా సంఘం నుంచి లక్ష్మణ, సతీష్, తరుణ్, కృష్ణ, శ్రీను టోర్నమెంట్ నిర్వహణ పనులను పర్యవేక్షిస్తున్నారు. ఈ పోటీల్లో ఎంపికైన జట్టు అస్సాంలోని గౌహతిలో సెప్టెంబరు 8, 9, 10 తేదీల్లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారు.

నేడు నవరస వార్షికోత్సవం

కాకినాడ కల్చరల్: స్థానిక దంటు కళాక్షేత్రంలో నవరస నాటక పరిషత్ 59వ వార్షికోత్సవం ఆదివారం ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకూ నిర్వహించనున్నట్టు పరిషత్ ఉపాధ్యక్షుడు మార్ని జానకీరామ్‌చౌదరి తెలిపారు. ఉదయం నాట్య భారతి నృత్యనికేతన్ విద్యార్థులచే కూచిపూడి నృత్యప్రదర్శన మధ్యాహ్నం ప్రేమానందం బృందంచే 'పద్మవ్యూహం' బుర్రకథ, సాయంత్రం హాస్యవల్లరి కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం శ్రీసాయి ఆర్ట్స్ సమర్పణలో 'గమ్యస్థానాల వైపు' నాటిక ప్రదర్శిస్తామని తెలిపారు. తదుపరి శ్రీసాయి కార్తిక్ క్రియేషన్స్ సమర్పణలో 'ఎడారిలో వాన చినుకు' నాటిక ప్రదర్శిస్తామని తెలిపారు. కళాభిమానులు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ప్రపంచం చూపు.. మన దేశం వైపు..



ర్యాలీలో పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు

బోట్‌క్లబ్: మన భారతీయ శాస్త్రవేత్తలు సాధించిన ఘనతతో ప్రపంచమంతా మన దేశం వైపు చూసేలా చేసిందని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ అన్నారు. శనివారం ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక భానుగుడి సెంటర్ నుంచి సర్పవరం జంక్షన్ వరకూ చంద్రయాన్-3 విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఇస్రో శాస్త్రవేత్తలు సాధించిన ఈ అపూర్వ విజయం ప్రతి ఒక్క భారతీయుడికి ఒక పండుగలాంటిదన్నారు. భారతీయులు అన్ని రంగాల్లోను దూసుకెళుతున్నారనేందుకు నిదర్శనమే చంద్రయాన్-3 విజయమన్నారు. బీ స్ట్రాంగ్ ఫిటినెస్ సెంటర్ అధినేత సంకీర్త్, అసోసియేషన్ అధ్యక్షుడు వెదురుపాక సతీష్, సభ్యులు సువర్ణ, శ్రీకర్, శివరామ్, పవన్‌కృష్ణ, సురేష్, రాజు పాల్గొన్నారు.

డ్రాపవుట్స్‌ను గుర్తించాలి

కరప: మండల పరిధిలో డ్రాపవుట్స్‌ను గుర్తించేందుకు ఇంటింటా సర్వేను సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కె.అప్పారావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం విద్యాశాఖాధికారులు, డిజిటల్ అసిస్టెంట్లు, సీఆర్పీలతో సమావేశమై డ్రాపవుట్స్‌పై సమీక్ష జరిపి, పలు సూచనలు చేశారు. 5 నుంచి 18 ఏళ్లవారు బడి బయట ఉంటే సర్వే ద్వారా గుర్తించి సెప్టెంబర్ నెల 5వ తేదీ లోగా పాఠశాలల్లో చేర్పించాలన్నారు. పదో తరగతి ఫెయిల్ అయినవారుండే 6 నెలల స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులో జాయిన్ చేయాలన్నారు. ఎంఈవో-1 కె.బుల్లి కృష్ణవేణి, ఎంఈవో-2 రపత్తి సత్యనారాయణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అంశాలపై సమీక్ష


సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీఓ సత్యనారాయణ

కాకినాడ సిటీ: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డివిజనల్ స్థాయి రెవెన్యూ అంశాలపై శనివారం సాయంత్రం ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ అంశాలైన అసైన్మెంట్, జగనన్నకి చెబుదాం, కోర్టు కేసులు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కేసులకు సంబంధించి సత్వర విచారణ చేసి నిర్ణీత గడువులో బాధితులకు న్యాయం అందించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మ్యుటేషన్, రీ సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవో కార్యాలయపు పరిపాలనాధికారి వరహాలయ్య, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

కరపలో దళిత మహాగర్జన

కరప: స్థానిక చిరంజీవి కల్యాణ మండపంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ రైట్స్ జస్టిస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన దళిత బహుజన మహా గర్జన కార్యక్రమం జరిగింది. అధ్యక్షులు చాటు శ్రీనివాసరావు, కార్యదర్శి వింత సురేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న రంగరాయ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ డి.వీరయ్య, ప్రముఖ డాక్టర్ బొండా సూర్యారావు మాట్లాడారు. అందరూ సామాజిక స్పృహతో ఎన్నికల్లో ఓటు వినియోగించుకోవాలన్నారు. డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, సవిలే రాజేష్, రొక్కాల నూకరాజు, జల్లా శివకుమార్, దాలిపర్తి శ్రీనివాస్, వివిధ వర్గాలకు చెందిన ప్రజలు, మహిళలు, యువజన సేవాసంఘంసభ్యులు పాల్గొన్నారు.

వీధుల్లో కొత్త వెలుగులు

- డివిజన్‌లోని 11 వీధుల్లో ఎల్‌ఈడీ బల్బులు
- రూ.50 లక్షలతో ఏర్పాటు
- ఆనందం వ్యక్తం చేస్తున్న స్థానికులు


గాంధీనగర్ రైతు బజార్ వద్ద ఎల్‌ఈడీ వెలుగులు

బోట్‌క్లబ్: ఆ వీధుల్లో లైట్లు ఉండేవి కాని ఏమీ కనిపించేది కాదు. ఆ బల్బులకు స్వస్తి పలికి ఎల్‌ఈడీ లైట్లు వేశారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక 41వ డివిజన్‌లోని 11 వీధుల్లో రూ.50 లక్షలతో ఎల్‌ఈడీ ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతంలో విద్యుత్ వెలుగులుతో జిగేలుమంటున్నాయి. ఎప్పుడో ఏర్పాటు చేసిన దీపాల కారణంగా ఆయా ప్రాంత ప్రజలు చీకటి పడితే చాలా ఇబ్బందులు పడేవారు. పలు ప్రాంతాల్లో అయితే వీధి దీపాలు వెలిగేవే కావు. వీధి శివారు ప్రాంతాల్లో మందు బాబులకు అడ్డాలుగా మారాయి. గత ప్రభుత్వ హయాంలో ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాధులే కరవయ్యారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను స్థానిక కార్పొరేటర్ గోడి సత్యవతి కాకినాడసిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆయన స్పందించి ఆయా ప్రాంతాల్లో రూ.50 లక్షలతో ఎల్‌ఈడీ బల్బులు ఏర్పాటు చేశారు.

బల్బులు ఏర్పాటు చేసి ప్రాంతాలు

వెంకనారాయణవీధి, ఒంటిమామిడి జంక్షన్, గాంధీనగర్ పార్కు నుంచి అచ్యుతాపురం రైల్వేగేటుకు వెళ్లే ప్రధాన రహదారి, పట్టాభివీధి, గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్‌వీధి, కమలాదేవి వీధి, రెడ్‌క్రాస్‌వీధి, పెనుమూడివారివీధి, దాట్ల వారివీధి, మల్లయ్య అగ్రహారం, ఓలేటివారి వీధుల్లో 110 ఎల్‌ఈడీలు ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం ఆయా ప్రాంతాలు పట్టపగలా అన్నట్టుగా ఉన్నాయి.

మహిళలు బయటకు రావాలంటే భయం

కేవలం 20 వాట్ల బల్బులు కారణంగా వెలుతురు బాగా తక్కువగా వచ్చేది. దీంతో మహిళలు చీకటి పడితే బయటకు రావాలంటే భయపడాల్సిన పరిస్థితి ఉండేది. శివారు ప్రాంతాల్లో ఆకతాయిలు ద్విచక్రవాహనాలపై గుంపులుగా ఏర్పడి అటుగా వెళ్లే మహిళలను హేళన చేసేవారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో పట్టపగలను తలపిస్తుండడంతో ఆగతాయిలు అటు పక్కకు కూడా రావడం లేదు. దీంతో మహిళలు నిర్భయంగా తమ అవసరాలు కోసం రాత్రి సమయాల్లో బయట తిరిగేందుకు వీలు కల్పించడంతో ఆయా ప్రాంత మహిళలు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే సహకారంతో..



ఏళ్ల తరబడి ఉన్న సమస్యను కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లడంతో ఆయన స్పందించి మా డివిజన్‌లో ఎల్‌ఈడీలు ఏర్పాటు చేయించారు. దీంతో ప్రయాణికులతోపాటు ఆయా ప్రాంత ప్రజలు ఎంతో ఆనందపడుతున్నారు. ఎమ్మెల్యేకు ఈ ప్రాంత ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారు.

– గోడి సత్యవతి, 41వ డివిజన్ మాజీ కార్పొరేటర్

లైట్లు వెలగక ఇబ్బంది పడేవాళ్లం



మేము స్థానిక పెనుమూడివారివీధిలో ఉంటాం. మా వీధిలో వీధి దీపాలు వెలగేవి కావు. అధికారులు మొరపెట్టుకున్నా ఎప్పుడో మరమ్మతులు చేసేవారు. అవి మళ్లీ నెలరోజుల తర్వాత పోయేవి. దీంతో సంవత్సరాల పాటు చీకట్లోనే మా వీధి ఉండేది. ప్రస్తుతం ఎల్‌ఈడీలు ఏర్పాటు చేయడంతో మా ప్రాంతం పగల్లాగే ఉంటుంది.

– బాదం లక్ష్మి, పెనుమూడివారివీధి, గాంధీనగర్

ప్రజల సంక్షేమమే జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- 13వ డివిజన్‌లో 'గడప గడపకూ'


ప్రభుత్వ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతిచ్చి, అండగా నిలవాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కోరారు. స్థానిక 13వ డివిజన్ సాంబమూర్తినగర్ ప్రాంతంలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి తదితరులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. నాలుగేళ్ల పాలనలో ప్రజలకు అందించిన ప్రభుత్వ పథకాల లబ్ధిని ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి, దగా చేసిన టీడీపీ ఇప్పుడు ప్రజలను మరోసారి మోసం చేసేందుకు ముందుకు వస్తోందన్నారు. జనసేన వంటి పార్టీలను వెంటేసుకుని తప్పుడు ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు చూస్తుందన్నారు. నవరత్న పథకాల ద్వారా ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకున్న సీఎంను మరోసారి గెలిపించుకుంటే ఆంధ్రప్రదేశ్ అన్నిరంగాల్లో మరింత అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట స్థానిక నాయకులు ఎండీ అస్గర్, కొప్పుల బుజ్జి, ఇతర నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఉద్యోగులు నిబద్ధత, నిజాయితీతో మెలగాలి

కలెక్టర్ కృతికా శుక్లా


అభ్యర్థులకు పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: సమాజానికి సేవ చేసే అవకాశం లభించిందని, విధి నిర్వహణలో నిబద్ధత, నిజాయితీతో వ్యవహరించి ఉద్యోగ రీత్యా అంచెలంచెలుగా ఎదగాలని కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. ఏపీపీఎస్సీ ద్వారా కొత్తగా నియమితులైన జూనియర్ అసిస్టెంట్ కం కంప్యూటర్ అసిస్టెంట్ అభ్యర్థులతో మాట్లాడారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకి సంబంధించి ఏపీపీఎస్సీ ద్వారా రెవెన్యూ శాఖలో కొత్తగా ఎంపికైన జూనియర్ అసిస్టెంట్ కం కంప్యూటర్ అసిస్టెంట్లకు శనివారం కలెక్టరేట్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా చేతుల మీదుగా అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో కొత్తగా ఎంపికైన ఉద్యోగులు విధుల్లో భాగంగా అధికారులను, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ పని చేయాలని, ఏవైనా సందేహాలుంటే సీనియర్ల నుంచి సూచనలు తీసుకోవాలన్నారు. వివిధ దస్త్రాలకు సంబంధించి అవగాహన పెంచుకోవాలన్నారు. శనివారం జరిగిన ప్రక్రియలో కాకినాడ జిల్లాకు 20 మంది, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు 20 మంది, తూర్పుగోదావరి జిల్లాకు 10 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాకు ఆరుగురు అభ్యర్థులను కేటాయించారన్నారు.

బాధితులకు ఏపీపీలు అండగా ఉండాలి

రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సుదర్శన్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సుదర్శన్‌రెడ్డి, తదితరులు

కాకినాడ లీగల్: కోర్టుకు వచ్చే బాధితులకు వారి కేసు వివరాలు తెలిపి, వారికి న్యాయం జరిగే వరకూ ఏపీపీలు అండగా ఉండాలని విజయవాడ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జె.సుదర్శన్ రెడ్డి సూచించారు. కాకినాడ రాయల్ పార్క్ హోటల్‌లో శనివారం జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వై.ప్రశాంతికుమారి ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు సంబంధించి ఏపీపీలు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఎఫ్ఐఆర్ నమోదైన కేసులు సంబంధించి వివరాలు ఎప్పటికప్పుడు ఏపీపీలు వద్ద ఉండాలని, కేసుల విచారణ వేగవంతం చేస్తే బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్ర హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.నాగిరెడ్డి మాట్లాడుతూ హైకోర్టు, సుప్రీం కోర్టు వెలువరించిన కొత్త తీర్పులపై ఏపీపీలు అవగాహన చేసుకుంటే మెరుగైన తీర్పులు వస్తాయన్నారు. రాష్ట్ర హైకోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.దుష్యంత్‌రెడ్డి మాట్లాడుతూ కొత్త చట్టాలు, తీర్పులపై అవగాహన పెంచుకోవడంతో పనిభారం సులభమవుతుందన్నారు. జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ మాట్లాడుతూ వరకట్నం కేసుల్లో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండడంతో బాధితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ కేసుల్లో వేగవంతంగా న్యాయం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జాయింట్ డైరెక్టర్ సుబ్బలక్ష్మమ్మ, ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా ఏపీపీలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో జనరంజక పాలన

గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కన్నబాబు


కొవ్వూరులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ సిటీ: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందిస్తున్నారని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. శనివారం రాత్రి కాకినాడ రూరల్ మండలం కొవ్వూరు సచివాలయం-1 పరిధిలో పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆ సమస్యలను అక్కడికక్కడే అధికారులకు సూచించి పరిష్కార మార్గాలను వివరించారు. పేదల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కన్నబాబు ప్రజలను అభ్యర్థించారు. సర్పంచ్ పిల్లి చక్రరావు, ఉప సర్పంచ్ పబ్బినీడి రమేష్, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఎమ్మెల్యే కన్నబాబుకు అడుగడుగునా మహిళలు హారతులతో స్వాగతం పలికారు.

క్లయిమ్‌ల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి


కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: ఇంటింటా ఓటర్ల సర్వే, ఆన్‌లైన్ ద్వారా వచ్చిన క్లైమ్‌లను నిర్దిష్ట గడువులో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు ఆదేశించారు. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో శనివారం ఆయన ఏఈఆర్వోలు, బీఎల్‌వోలతో సమీక్షించారు. కమిషనర్ నాగనరసింహారావు మాట్లాడుతూ కొన్ని బూత్‌ల పరిధిలో ఐదు కన్నా ఎక్కువ ఓట్లు తొలగించాలని వచ్చిన అభ్యర్థనలను పరిశీలించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఫారం-6, 7,8 లను క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని ఆదేశించారు. ఈ మొత్తం ప్రక్రియను నిర్దిష్ట కాలవ్యవధిలో సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు అనుగుణంగా విచారణ ప్రక్రియ జరగాలన్నారు. వచ్చిన దరఖాస్తుల్లో సరైన సమాచారం లేకపోతే వాటి వివరాలను కూడా ప్రత్యేకంగా రూపొందించి అందజేయాలన్నారు. సమావేశంలో కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్‌కోన శ్రీనివాస్, ఏసీపీ నాగశాస్త్రులు, ఎలక్షన్ డీటీ మురళీకృష్ణ, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

కొనుగోలుదారులకు న్యాయం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను

కాకినాడ రూరల్: గంగనాపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 90లో 1.15 ఎకరాల స్థలంలో ప్లాట్లు కొనుగోలు చేసుకున్న వారికి న్యాయం చేయాలని, ప్రైవేట్ స్థలాలపై కావాలని రాజకీయాలు చేస్తున్నారని కాకినాడ రూరల్ ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను అన్నారు. ఇంద్రపాలెంలో తన నివాసంలో శనివారం ప్లాట్ల కొనుగోలుదారులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తనతో కలిసి నలుగురం 2015 -16లో ఆ స్థలాన్ని డెవలప్‌మెంట్‌కు తీసుకున్నామన్నారు. అనంతరం పలువురు ప్లాట్లు కొనుగోలు చేశారన్నారు. అదే గ్రామానికి చెందిన దుప్పలపూడి సత్యనారాయణ అప్పట్లో డబ్బులు అడగడంతో ఇవ్వనందున కొందరితో కలిసి ఆ స్థలంలో పాకలు వేయించి ఇబ్బంది పెట్టారన్నారు. అనంతరం తహసీల్దార్ విచారణ చేసి అది ప్రైవేట్ స్థలమని తేల్చారన్నారు. దీంతో ఆ పాకలను కొనుగోలుదారులు పీకి వేశారన్నారు. సత్యనారాయణ షెడ్లు వేసే ప్రయత్నం చేయడంతో కొనుగోలుదారులు అడ్డుకున్నారన్నారు. తాను కొందరిని తీసుకెళ్లి బెదిరించినట్టు వస్తున్న ఆరోపణలు వాస్తవం కాదన్నారు. సమావేశంలో శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టరు అనుసూరి ప్రభాకరరావు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వ్యాయామ విద్యకు ప్రాధాన్యం

- 28న పీఈటీలకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు
- ఆ దిశగా ఏర్పాట్లు పూర్తి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాలల్లో క్రీడలకు, వ్యాయామ విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. తాజాగా అమలులోకి వచ్చిన విధి విధానాలు, వివిధ అంశాలపై వ్యాయామ ఉపాధ్యాయులకు పలు సూచనలు చేసేలా చర్యలు చేపట్టింది. తాజాగా పాఠశాల విద్యా శాఖ కమిషనర్ నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో ఈ మేరకు ఉత్తర్వుల జారీ చేశారని జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు వి.రవిరాజు తెలిపారు. ఈనెల 28వ తేదీన వ్యాయామ ఉపాధ్యాయులకు మొదటి సారిగా పీఈటీ, పీడీలకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంది. ఈ సమావేశాలకు ఆయా నియోజకవర్గాల పరిధిలోని అన్ని యాజమాన్యాల పీఈటీ, పీడీ విధిగా హాజరుకావల్సి ఉంది.

స్కూల్ కాంప్లెక్స్ వేదికలివే

రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు ఎల్.జార్జి పర్యవేక్షణలో కాకినాడ జిల్లాలో కాకినాడ సిటీ నియోజకవర్గం వారికి గాంధీనగర్ నగరపాలక కార్పొరేషన్ స్కూల్, కాకినాడ రూరల్ నియోజకవర్గం వారికి వాకలపూడి జెడ్పీ హైస్కూల్, పిఠాపురం వారికి బీఎంఆర్ హైస్కూల్, తుని నియోజకవర్గం వారికి తుని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, పెద్దాపురం నియోగజకవర్గానికి లూథరన్ హైస్కూల్, ప్రత్తిపాడు నియోగజకవర్గానికి ప్రత్తిపాడు జెడ్పీ హైస్కూల్, జగ్గంపేట నియోజకవర్గానికి జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించనున్నట్టు రవిరాజు తెలిపారు.

మదర్‌థెరిస్సా గొప్ప మానవతామూర్తి

ఎమ్మెల్యే కన్నబాబు


పేదలకు నూతన వస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ సిటీ: మదర్ థెరిసా గొప్ప మానవతామూర్తి అని ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపారని, ఆమె సేవా దృక్పదాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని మాజీ మంత్రి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. శనివారం కాకినాడ రూరల్ మండలం తూరంగిలో పీస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ మండవ సమాధానం ఏర్పాటు చేసిన మదర్‌థెరిస్సా జయంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మానవత్వానికి మించిన సంపద లేదని, మనిషి ఔనత్యానికి కొలబద్ద మేథస్సు కాదు హృదయం అని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప సేవకురాలు మదర్‌థెరిసా అని కన్నబాబు కొనియాడారు. మదర్‌థెరిసాను ఆదర్శంగా తీసుకొని ఆమె అడుగుజాడల్లో పేదలకు సేవ చేయాలనే దృక్పథంతో 14 ఏళ్లగా కాకినాడ రూరల్ నియోజక వర్గంలోని పలు గ్రామాల్లో పేదలకు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న మండవ సమాధానం సేవలను కన్నబాబు అభినందించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కాకినాడ జిల్లా వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి, మాజీ సర్పంచ్ బలగం ప్రసన్నకుమార్ మాట్లాడుతూ పీస్ సేవా సంస్థ పేరుతో సమాధానం వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు, పేదలకు ఏటా 500 నుంచి 800 వరకు నూతన వస్త్రాలు అందజేస్తూ వారికి ఎంతో సేవను చేస్తున్నారని, ఆయన సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా పీస్ సంస్థ చైర్మన్ సమాధానాన్ని ఎమ్మెల్యే కన్నబాబుతో పాలు పలువురు నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు, ప్రజలు, గ్రామపెద్దలు సత్కరించారు. కరప మండలం విజయరాయుడుపాలెంలో 200 మందికి నూతన వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, పీటీ స్కూల్ అధినేత పాస్టర్ కేజీ కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు జగడం శ్రీహరి, ఆతం భద్రం, గొల్లపల్లి బాబులు, అనిశెట్టి రామకృష్ణ, పంపన రామకృష్ణ, దాట్ల సత్యనారాయణరాజు, శ్రీనుబాబు, రవీంద్రనగర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో విశ్వమాత మదర్ థెరిస్సా జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. మదర్ థెరిస్సా చిత్రపటానికి డాక్టరు సువర్ణరాజు, అడబాల రత్నప్రసాద్, రాఘవరావు, రెడ్డం రాజా తదితరులు నివాళులర్పించారు. థెరిస్సా సేవలను కొనియాడారు. ఆమె సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం పద్మశ్రీ, భారత రత్న వంటి పురస్కారాలతో సత్కరించిందన్నారు.

కాలుష్య నియంత్రణలో టాటా మోటార్స్ కీలక పాత్ర



వాహనాన్ని ఆవిష్కరిస్తున్న కమిషనర్ నాగ నరసింహారావు

బోట్‌క్లబ్(కాకినాడసిటీ): ప్రస్తుత సమాజంలో వాతావరణ మార్పులు అనుగుణంగా కాలుష్య నియంత్రణలో టాటా మోటార్స్ కీలక పాత్ర పోషిస్తుందని కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ నాగ నరసింహారావు అన్నారు. శనివారం టాటా ఆథరైజ్డ్ డీలర్ శివశంకర్ మోటార్స్ షోరూమ్‌లో టాటా పంచ్ ఐ సీఎన్‌జీ నూతన మోడల్ వాహనాన్ని ఆయన ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణ కోసం అనేక మోడల్స్‌ను టాటా మోటార్స్ ప్రవేశపెడుతుందన్నారు. షోరూమ్ మేనేజర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గతంలో ఆల్ట్రో సీఎన్‌జీ విశేష ఆదరణ లభించిందన్నారు. ప్రస్తుతం టాటా పంచ్ ఐ సీఎన్‌జీ మోడల్‌లో అన్ని అత్యాధునిక సదుపాయాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ వెంకట రవీంద్ర, మురళీ, నరేష్, కిరణ్, సేల్స్ మేనేజర్ రాజు, సర్వీస్ జియం కృష్ణారావు, మల్లిక్, జగన్, సేల్స్, సర్వీస్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీలు


జిల్లాస్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా పుట్ బాల్ సంఘం ఆధ్వర్యంలో కాకినాడ డీఎస్ఏ క్రీడామైదానంలో శనివారం జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీలు శనివారంతో ముగిశాయి. జిల్లా అధ్యక్షుడు సంతోష్‌కుమార్ మాట్లాడుతూ జూనియర్స్ విభాగంలో 10 జట్లు, సీనియర్స్ విభాగంలో 8 జట్లు పోటీపడ్డాయన్నారు. పుట్ బాల్ కోచ్ స్వామి, కార్యదర్శి రాజేష్ మాట్లాడుతూ ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. సెప్టెంబరులో జరగనున్న జోనల్‌స్థాయి పోటీలకు కాకినాడ నుంచి విజేతల జట్టు ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. స్వామి ఫ్రెండ్స్ జట్టు ద్వితీయస్థానంలో నిలువగా, సిటీ ఫుట్‌బాల్ సొసైటీ జట్టు విజేతగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఫుట్‌బాల్ క్రీడాకారులు, కోచ్‌లు, పీఈటీలు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

కరప: విద్యార్థులు తమ అభిరుచులకు అనుగుణంగా నచ్చిన కోర్సు చదివి, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఇన్‌చార్జి హెచ్ఎం వీవీ రమణమూర్తి అన్నారు. గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి, పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుడు ఐ.ప్రసాదరావు మాట్లాడుతూ ఈ రోజు చంద్రుడిపై మన భారత జెండా ఎగురవేయడానికి కారణం సైన్స్ అండ్ టెక్నాలజీ అన్నారు. ఏరోస్పేస్, ఏరోనాటికల్ ఇంజినీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వంటి నూతన కోర్సులు అందుబాటులోకి వచ్చాయని విద్యార్థులు, తమకిష్టమైనవి ఎంచుకుని చదువుకోవాలన్నారు.

పురుషులతో సమానంగా మహిళలు

కాకినాడ రూరల్: ఆకాశమే హద్దుగా మన దేశంలో మహిళలు పురుషులతో సమానంగా అన్నింటా ఎదుగుతున్నారని జేఎన్‌టీయూకే ప్రొఫెసరు ఆలపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా సమానత్వ దినోత్సవం సందర్భంగా సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసి అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. 1972 ఆగస్టు 26 నుంచి ఏటా అంతర్జాతీయ మహిళా సమానత్వ దినోత్సవాన్ని జరుపుకొంటున్నామన్నారు. అన్ని రంగాలలో మహిళలు పురుషులతో సమానంగా ఎదగడానికి న్యాయస్థానాలు కృషి చేస్తున్నాయన్నారు. విద్య, ఉద్యోగ అవకాశాలు కోసం మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తున్నారు. లింగ వివక్షను చూపొద్దని సూచించారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.